క్లుప్తంగా

నేటి నుంచి బీసీ చైతన్య యాత్ర

అల్వాల్: కేసీఆర్ ప్రభుత్వం బీసీ కులాలకు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించేందుకు బీసీ చైతన్య యాత్ర పేరుతో సోమవారం నుంచి మచ్చబొల్లారం డివిజన్‌లో పాదయాత్ర చేపట్టనున్నట్లు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రచార కార్యదర్శి జిల్లెల రవియాదవ్ పేర్కొన్నారు. మచ్చబొల్లారం డివిజన్‌లోని కొకూర్ మహంకాళి దేవాలయం నుంచి పోలింగ్ బూత్ నంబర్లు 1, 2, 3, 4, 5, 6 పరిధిలోని వచ్చే బస్తీలు, కాలనీల్లో సోమవారం ఉదయం 9 గంటలకు పాదయాత్ర మొదలవుతుందని తెలిపారు. బీజేపీ మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గ రాష్ట్ర, జిల్లా, డివిజన్, వివిధ మోర్చా బీజేపీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

బోడుప్పల్: నార్త్ బాలాజీ హిల్స్ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని 21వ డివిజన్ కార్పొరేటర్ భూక్యా సుమన్ నాయక్ అన్నారు. నార్త్ బాలాజీ హిల్స్ కాలనీవాసులు ఆదివారం కార్పొరేటర్‌ను కలిసి తమ సమస్యను వివరించగా ఆయన అందుకు సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో పర్యటించి అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. కార్పొరేటర్‌ను కలిసిన వారిలో సునీల్‌రెడ్డి, అస్లాం, మురళి, నాగరాజు, సురేందర్, శ్రీనివాస్, పవన్ తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పల్లవి అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ గురువు పీబీ కృష్ణభారతి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. పూర్వ రంగం, గణేశా పంచరత్న కీర్తన, అష్టపది, నీలమేఘ, అమృత, శిరీష, శ్రీకృతి, రితిక, అనన్య, వర్ష ప్రదర్శించారు. పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ ప్రొఫెసర్ వెంకటచారి, కూచిపూడి నృత్య కళాకారిణి డాక్టర్ హిమబిందు కనోజ్ కళాకారులను అభినందించారు.

బొడ్రాయి పండుగ



మౌలాలి: మౌలాలి డివిజన్ పరిధిలోని ఎస్పీనగర్ వడ్డెర బస్తీలో ఆదివారం బొడ్రాయి పండుగ భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మల్కాజిగిరి బీజేపీ సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌యాదవ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శివ, నాగేశ్వర్‌రావు, చిత్తారి, రాజు, ఎస్పీ నగర్‌వాసులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభకు తరలిన నేతలు



బోడుప్పల్: నాగర్‌కర్నూల్‌లో ఆదివారం నిర్వహించిన దళిత గిరిజన ఆత్మగౌరవ సభకు బోడుప్పల్ నుంచి కాంగ్రెస్ పార్టీ నేతలు తరలి వెళ్లారు. వారిలో కార్పొరేటర్లు పోగుల నర్సింహరెడ్డి, బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, నేతలు కొత్త కిశోర్‌గౌడ్, పొన్నం తరుణ్‌గౌడ్, కొత్త సుశాంత్‌గౌడ్, సింగిరెడ్డి రాజిరెడ్డి, అసర్ల బీరప్ప, రాపోలు ఉపేందర్, పోగుల దీలీప్‌రెడ్డి కందుకూరి నవీన్ తదితరులున్నారు.

మురుగు పరుగు ఆగేదెన్నడో..?



కుషాయిగూడలో పొంగి పొరుతున్న మురుగు

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, కుషాయిగూడ మార్కెట్ వెనుక భాగంలో పది రోజులుగా మురుగు పొంగి పారుతోంది. దీంతో వీధులన్నీ మురుగుమయమై కాలనీలో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ఈగలు, దోమలు వ్యాప్తి చెంది ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. ఇంటి బయట అడుగు పెట్టాలంటే మురుగులోంచే వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని వాపోతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఇకనైనా అధికారులు స్పందించి మురుగు నీటి సమస్యకు పరిష్కారం చూపాలని కాలనీవాసులు కోరుతున్నారు.

బోడుప్పల్, జవహర్‌నగర్‌లో.. యథేచ్ఛగా భూ దందా!

- సర్కారు ఆదాయానికి భారీగా గండి
- రాత్రికి రాత్రే వెలుస్తున్న అక్రమ కట్టడాలు
- పురపాలికలు, జీపీల్లో దండిగా అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లు
- ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లోనూ కట్టడాలు
- పట్టించుకోని రెవెన్యూ శాఖ
- కూల్చివేసి క్రిమినల్ కేసులు పెడతాం: కలెక్టర్ హరీష్

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో భూదందా యథేచ్ఛగా కొనసాగుతోంది. 'చేను కంచె మేసే' అన్న చందంగా అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లను నిరోధించి ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు వాటిని పట్టించుకోకపోవడంతో పాటు వారే అక్రమాలను ప్రోత్సహిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. పేదలు గుడిసె వేసుకుంటే కూల్చే వరకు వెంటపడే అధికారులు ప్రభుత్వ స్థలాల పరిరక్షణ, అక్రమ కట్టడాల కూల్చివేతలో మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారు. అర్థ, అంగ బలం ఉన్న బడాబాబులు, రాజకీయ నేతల అనుచరులు గజాలు కాదు.. ఏకంగా ఎకరాల కొద్దీ ఆక్రమించేస్తూ ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి కొడుతున్నారు.

ఈ ప్రాంతాల్లో అధికంగా...

◆ బోడుప్పల్ నగరపాలక సంస్థ పరిధిలోని సర్వే నంబర్ 63/29లో 30 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉండగా.. 1974 నుంచి ఆక్రమణకు గురవుతోంది. బోడుప్పల్ జీపీగా ఉండటంతో ఓ కబ్జాదారుడు 220 గజాల నుంచి 440 గజాల చొప్పున నకిలీ లేఅవుట్ సృష్టించి ఒక్కో ప్లాట్‌కు రూ.50 వేల నుంచి రూ.లక్షకు విక్రయించాడు. ప్రస్తుతం ఇదే స్థలాన్ని కబ్జాదారులు, పలువురు రాజకీయ నేతలు ప్రజాప్రతినిధుల అండతో 60 గజాల నుంచి 80 గజాలు ఉండేలా కొత్త లేఅవుట్ సృష్టించి ఒక్కో ప్లాట్‌ను గజానికి రూ.10 వేల చొప్పున విక్రయిస్తున్నారు. దీంతో బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని సర్వే నంబరు 63/29లో రాత్రికి రాత్రే అక్రమంగా ఇళ్లు వెలుస్తున్నాయి. ఇందుకు గాను స్థానిక ఉద్యోగి మొదలుకుని ఓ స్థాయి అధికారి వరకు ఒక్కో ప్లాట్‌కు రూ.50 వేలు ముట్టజెప్పుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



బోడుప్పల్ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో ఇలా..



జవహర్‌నగర్‌లో అనుమతులు లేకుండా ఫామ్ ల్యాండ్ పేరుతో వెలసిన విల్లాలు

◆ నాగారంలోని 297 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతున్నా రెవెన్యూ శాఖలో చలనం లేదు. నాగారం మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న ఐదెకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూములు కబ్జాకు గురయ్యాయి.

◆ శామీర్‌పేట్‌లో రియల్టర్లు తమకున్న 45 ఎకరాల పక్కన 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేసి వెంచరు చేసినా.. రెవెన్యూ అధికారులకు స్పందన లేదని తెలుస్తోంది.

◆ జవహర్‌నగర్‌లోని సర్వే నంబర్లు 137, 377, 583, 586, 598, 647ల లోని దాదాపు 30 ఎకరాల ప్రభుత్వ భూముల్లో నకిలీ లేఅవుట్లు సృష్టించి ఒక్కో ప్లాట్‌ను రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు కబ్జాదారులు విక్రయిస్తున్నారు. పలువురు కార్పొరేటర్లు, నేతలు కీలకంగా వ్యవహరిస్తుండగా.. ఓ ప్రజాప్రతినిధి అండదండలు ఉన్నట్లు తెలుస్తోంది.

అక్రమ నిర్మాణాలు.. లేఅవుట్లు..

◆ లింగాపూర్ తండా రెవెన్యూ పరిధిలోని రెండున్నర ఎకరాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఫామ్‌ల్యాండ్ పేరుతో వెంచర్ చేసి ఇందులో ఒక్కో విల్లాను రూ.60లక్షల నుంచి రూ.75 లక్షలకు విక్రయిస్తున్నారు.

◆ ఘట్కేసర్ మండలం కొర్రెములలోని సర్వే నంబర్ 748,749 పరిధిలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అలాగే 50 నుంచి 75 వరకు అక్రమ భవన నిర్మాణాలవుతున్నా.. అమ్యామ్యాలకు అలవాటు పడిన పలువురు అధికారులు, సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేసి ప్రభుత్వ భూములు కాపాడుతాం



జిల్లాలో ప్రభుత్వ, అసైన్డ్ భూములను పరిరక్షిస్తాం. పురపాలకలు, జీపీల్లో వెలసిన అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తాం. బఫర్ జోన్, చెరువు శిఖాలు, నాలాలు, రోడ్లు ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను సైతం కూల్చివేస్తాం. జిల్లాలో టాస్క్ ఫోర్స్‌టీమ్‌లు అక్రమ నిర్మాణాల కూల్చివేతపై నిరంతరం నిఘా ఉంచింది. అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలు చేపట్టే వారిపై అవసరమైతే క్రిమినల్ కేసులు పెడతాం. టీఎస్ బీ–పాస్ ద్వారా ఇళ్లు, బహుళ అంతస్తుల నిర్మాణాలకు ఖచ్చితంగా అనుమతులు తీసుకోవాలి.

– హరీష్, కలెక్టర్, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా

ప్రతి నిత్యం ఏదో ఓ చోట...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రతి రోజు ఏదో ఒక డివిజన్‌లో అక్రమ కట్టడాలు జరుగుతూనే ఉన్నా.. పట్టించుకునే వారే కరవయ్యారు. జవహర్‌నగర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా 40 నుంచి 50 వరకు బహుళ అంతస్తు భవనాలు వెలువగా... ఇందులో ముగ్గురు ముఖ్య ప్రజాప్రతినిధులవే ఉన్నట్లు తెలుస్తోంది. పదుల సంఖ్యలో అక్రమ భవనాలు వెలిసినా.. నిరుపేదలవి కూల్చివేస్తున్న అధికారులు రాజకీయ నేతల ఇళ్ల జోలికి వెళ్లడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

అధికారికంగా గుర్తించిన కట్టడాలివే..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో పురపాలక సంఘాలైన నాగారంలో 12 అక్రమ కట్టడాలు, లేఅవుట్లు ఉండగా, బోడుప్పల్‌లో 107, పీర్జాదిగూడలో 67, దమ్మాయిగూడలో 7, మేడ్చల్‌లో 10, నిజాంపేట్‌లో 20, కొంపల్లిలో 11, దుండిగల్‌లో 12, తూముకుంటలో 15, పోచారంలో 12, ఘట్‌కేసర్‌లో 8 ఉన్నట్లు గుర్తించారు. రూరల్ జిల్లా పరిధిలోని కీసర మండలంలో 265, శామీర్‌పేట్‌లో 185, మేడ్చల్‌లో 72, ఘట్‌కేసర్‌లో 67, ఏంసీ పల్లి మండలంలో 89 అక్రమ కట్టడాలు, లేఅవుట్లు ఉన్నట్లు జిల్లా పంచాయతీ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తూ..

హబ్సిగూడ: ఉప్పల్ డివిజన్ ఉప్పల్ హిల్స్ కురుమ నగర్ కాలనీల్లో తాగునీరు, సీసీ రోడ్ల సమస్యలను పరిష్కరించాలని ఆదివారం కాలనీవాసులు హబ్సిగూడలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు బాజే అబ్బయ్య, బీఆర్ఎస్ నాయకులు నోముల మైసయ్య, రామంతాపూర్ కురుమ సంఘం సభ్యులు రేవు కిష్టయ్య, కాలనీవాసులు సోమయ్య, శ్రీనివాస్, నర్సింహగౌడ్, సుధాకర్, సుబ్బారెడ్డి, ప్రభాకర్, పెంచలయ్య, అంజయ్య, రాజు, రామాచారి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యసభ సభ్యులు కేశవరావును కలిసిన ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి



రాజ్యసభ సభ్యులు కేశవరావును ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, హబ్సిగూడ మాజీ కార్పొరేటర్ బేతి స్వప్నరెడ్డి ఆదివారం కలిశారు. వచ్చేనెల 9వ తేదీన తమ కుమారుడు బేతి సుమంత్‌రెడ్డి వివాహానికి హాజరుకావాలని ఆహ్వాన పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

మల్లాపూర్: రాష్ట్రంలో రెండు సంవత్సరాల నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని దళిత జన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ బొజ్జ రాకేష్ ఆదివారం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. పలు ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో మొత్తం ఫీజు చెల్లిస్తేనే వారి సర్టిఫికేట్స్ ఇస్తామని విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.



మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసిన దళిత జన స్టూడెంట్ ఫెడరేషన్ నేతలు

బొజ్జ రమేష్, ఇప్పల కుమార్, తోల అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



స్వప్న కుటుంబాన్ని పరామర్శిస్తున్న కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: నాచారం డివిజన్ రాఘవేంద్రనగర్‌లో అగ్నిప్రమాదానికి గురైన స్వప్న కుటుంబాన్ని ఆదివారం జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ పరామర్శించారు. అనంతరం వారి కుటుంబానికి నిత్యావసర వస్తువులు, ఆర్థిక సాయం అందజేశారు. వారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్‌యాదవ్, సాయిజెన్ శేఖర్, విఠల్‌యాదవ్, నర్సింహ, రవీందర్‌రెడ్డి, కైలాష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ స్థాయి మహాసభ

కీసర: రాంపల్లిదాయర గ్రామ రెవెన్యూ పరిధి లో గల బాలవికాస సంస్థలో సోమవారం ఉద యం 'జన నిర్మాణం–సమాజ వికాసం' అనే అంశంపై జాతీయ స్థాయి మహాసభను నిర్వహి ంచడం జరుగుతుందని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల తో పాటు మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక రా ష్ట్రాల నుంచి సుమారు 7వేల మంది బాల వికా స అభివృద్ధి కమిటీకి చెందిన మహిళ, రైతు, శు ద్ధిత నీటి ప్లాంట్ల, వితంతు, విద్యా వికాస నాయకులు మహాసభలో పాల్గొనున్నట్లు తెలిపా రు. ముఖ్యఅతిథుగాలు మంత్రులు తన్నీరు హ రీష్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, మల్లారెడ్డి, ఏపీ మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ రాజే ష్‌పవర్ తదితరులు పాల్గొననున్నట్లు తెలిపారు.

తైక్వాండోలో మేడ్చల్ విద్యార్థుల ప్రతిభ

మేడ్చల్‌రూరల్: జాతీయ తైక్వాండో పోటీల్లో మేడ్చల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు తమిళనాడులోని కేఎస్ఆర్ యూనివర్సిటీలో జరిగిన జాతీయ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణకు చెందిన నలుగురు విద్యార్థులు పాల్గొనగా వారిలో మేడ్చల్‌కు చెందిన విద్యార్థిణులు రీచా యాదవ్, దేవశ్రీలు పాల్గొన్నారు. ఈ పోటీల్లో రీచా యాదవ్ రజతం, దేవశ్రీ కాంస్య పతకాలను సాధించి సత్తా చాటడంతో పాటు అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. పోటీల్లో కోచ్ లక్ష్మణ్, బిందు పాల్గొని పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

ఎంఈడీ, ఎంపీఈడీ జాబితా విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూతో పాటు ఇతర వర్సిటీల పరిధిలోని కాలేజీల్లో ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సుల్లో సీటు సాధించిన విద్యార్థుల చివరి జాబితాను విడుదల చేసినట్లు సీపీజీఈటీ–2022 కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి తెలిపారు. అడ్మిట్ కార్డుతో పాటు ఇతర ఒరిజినల్ సర్టిఫికెట్లను ఈ నెల 25 వరకు ఆయా కాలేజీల్లో రిపోర్టు చేయాలన్నారు. ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సులలోని మొత్తం 891 సీట్లలో 550 సీట్లు భర్తీ కాగా ఎంఈడీలో 300 సీట్లు మిగిలినట్లు కన్వీనర్ పేర్కొన్నారు.

ముగిసిన వర్క్‌షాప్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ పొలిటికల్ సైన్స్ విభాగంలో మూడ్రోజుల పాటు జరిగిన డిగ్రీ అధ్యాపకుల వర్క్‌షాప్ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా వీసీ ప్రొ.రవీందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఉపన్యసించారు. అనంతరం వర్క్‌షాప్‌లో పాల్గొన్న డిగ్రీ కాలేజీల పొలిటికల్ సైన్స్ అధ్యాపకులకు సర్టిఫికెట్లు అందజేశారు.

రక్తదానం చేసి ప్రాణాలు కాపాడండి



రక్తదాన శిబిరంలో మేయర్ బుచ్చిరెడ్డి

బోడుప్పల్: ఆరోగ్యవంతమైన జీవితం కోసం రక్తదానం చేయాలని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. 26వ డివిజన్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి పరాక్రమ దివాస్‌ను పురస్కరించుకుని ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరమైన వారికి రక్తం అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎంతో మందికి సకాలంలో రక్తం అందక మృతి చెందుతున్నారన్నారు. మనం రక్తదానం చేస్తే ప్రాణాలు కాపాడవచ్చని, పెద్ద ఎత్తున రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రొద్దుటూరు వెంకటేశ్ శోభారాణి, పోగుల నర్సింహరెడ్డి, నేతలు కొత్త కిశోర్‌గౌడ్, గోనె శ్రీనివాస్, తలారి రవి, రాసాల మహేష్‌యాదవ్, వీరారెడ్డినగర్ కాలనీ అధ్యక్షుడు చింతమాన్ నగేష్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి పి.బస్వారెడ్డి, కోశాధికారి కోట్ల రవీందర్ పాల్గొన్నారు.

పోరాటాలతో స్థలాలను కాపాడుకుందాం

బోడుప్పల్: రాష్ట్ర ప్రభుత్వం వక్ఫ్ భూములుగా ప్రకటించిన స్థలాలను పోరాటంతోనే సాధించుకుందామని 14వ డివిజన్ కార్పొరేటర్ కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల అధ్యక్షులు, కార్యదర్శులతో కలిసి వక్ఫ్ బాధితుల ఐక్య వేదికను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 20 ఏళ్ల క్రితం స్థలాలు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకుని ఇళ్లు నిర్మించుకున్నామన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం 2018వ సంవత్సరంలో రిజిస్ట్రేషన్లు నిలిపివేసి వక్ఫ్ భూములుగా ప్రకటించిందన్నారు. ఇదే విషయంపై స్థానిక మంత్రి చామకూర మల్లారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి పరిష్కారం చూపలేదన్నారు. బాధితులందరం ఐక్యంగా పోరాడి తమ స్థలాలను కాపాడుకుందామని ఆయన పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి

అల్వాల్‌లో ముదిరాజ్ సంఘం కేలండర్ ఆవిష్కరణ

అల్వాల్: ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండి అన్ని రంగాల్లో ముందుండాలని సంఘం అధ్యక్షుడు పసుపులేటి విజయకుమార్ అన్నారు. అల్వాల్ సంఘం కార్యాలయంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన న్యూఇయర్ కేలండర్‌ను సంఘం సభ్యులతో కలిసి ఆదివారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు మన్నే అశోక్‌కుమార్, సభ్యులు వజ్రం నర్సింగ్, రాజ్ ముదిరాజ్, యుగేందర్, శ్రీనివాస్, రితేష్, అంజయ్య, శివకుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపులు అన్నిరంగాల్లో రాణించాలి

కుషాయిగూడ: మున్నూరు కాపులు అన్నిరంగాల్లో రాణించాలని గ్రేటర్ మాజీ మేయర్ బొంతు రాంమోహన్ అన్నారు. చర్లపల్లి విష్ణేశ్వర మున్నూరు కాపు సంఘం కేలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్నూరు కాపులు రాజకీయంగా గుర్తింపు సాధించి హక్కులను సాధించుకోవాలన్నారు. సమష్టిగా కృషిచేసి సంఘం అభివృద్ధితో పాటు మున్నూరు కాపులందరి అభ్యున్నతికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో గందం నాగేశ్వరరావు, పుటం పురుషోత్తం పాల్గొన్నారు.



మున్నూరు కాపు సంఘం కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న గ్రేటర్ మాజీ మేయర్ బొంతు రాంమోహన్

గీత పనివారల సంఘం కేలండర్ ఆవిష్కరణ

గౌతంనగర్: గీత కార్మికుల హక్కుల రక్షణకు ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధులు, మాజీ పార్లమెంట్ సభ్యులు బొమ్మగాని ధర్మభిక్షం స్థాపించిన గీత పనివారల సంఘానికి ఘన చరిత్ర ఉందని గీత పనివారల సంఘం మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.యాదయ్యగౌడ్ అన్నారు. మల్లికార్జుననగర్‌లోని సీపీఐ కార్యాలయంలో తెలంగాణ గీత పనివారల సంఘం కేలండర్‌ను ఆవిష్కరించారు.



అల్వాల్‌లో కేలండర్ ఆవిష్కరిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయవద్దు



కమలానగర్‌లో అవగాహన ర్యాలీలో కార్పొరేటర్ శిరీషారెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులు

కాప్రా: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకూడదని ఏఎస్‌రావునగర్ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషాసోమశేఖర్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛ అభియాన్‌లో భాగంగా ఆదివారం కమలానగర్‌లో బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయకూడదని జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఆమె అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వేరు చేయాలని, స్వచ్ఛ ఆటో కార్మికులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో కాప్రా సర్కిల్ ఏఎంహెచ్‌వో డాక్టర్ స్వప్నరెడ్డి, కాంగ్రెస్ పార్టీ బీ–బ్లాక్ అధ్యక్షులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.